రైతులు నాకు ఫోన్ చేసే దాకా..

మీరేం చేశారు?

అధికారుల సమన్వయలోపమే ప్రమాదానికి కారణం

ముందే గేట్లు తెరిచి ఉంటే ప్రమాదం జరిగేది కాదు కదా?

హెలికాప్టర్లు తిరిగే వాతావరణం లేకుంటే ప్రాణనష్టం జరిగేదే కదా?

'పెదవాగు' సమీక్షలో అధికారులకు మంత్రి తుమ్మల మందలింపు

ప్రమాదంపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌కు సూచన

మంత్రి తుమ్మలకు సమాధానమిస్తున్న ఐబీ అధికారులు

అశ్వారావుపేట రూరల్, జూలై 21:'రైతులు నాకు ఫోన్ చేసే దాకా మీరేం చేశారు? అధికారుల సమన్వయంతో పనిచేసి గేట్లను ముందుగానే తెరిచి ఉంటే ప్రమాదం జరిగేది కాదు కదా? వెలుతురు తగ్గి హెలికాప్టర్లు తిరిగే వాతావరణం లేకుంటే ప్రాణనష్టం జరిగేదే కదా?' అంటూ అధికారులకుపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం పెదవాగు ప్రాజెక్టుకు ఇటీవల గండి పడిన ప్రమాదంపై అక్కడి గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అధ్యక్షతన వివిధ శాఖల జిల్లా అధికారులతో ఆదివారం మంత్రి తుమ్మల సమీక్షించారు. తొలుత కలెక్టర్ మాట్లాడుతూ.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అశ్వారావుపేట మండలానికి ఒక డ్రోన్, ఒక బోటు ఏర్పాటు చేస్తామని అన్నారు. రెండు హైలికాప్టర్లు, ఎన్ఆర్‌డీఎస్ బృందాలతో వ్యవసాయ కూలీలు, పశువుల కాపర్లు, రైతులను కాపాడమని వివరించారు. కానీ ఆస్తినష్టం జరిగిందని అన్నారు. తరువాత ఐబీ ఈఈ సురేశ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రాజెక్టు సామర్థ్యం 35 వేల క్యూసెక్కులు మాత్రమేనని, కానీ ఎగువ నుంచి 80 వేల క్యూసెకుల వరద వచ్చిందని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ.. 'గేట్లకు గ్రీజ్ ఎప్పుడు పెట్టారు? పైకి కిందకు ట్రయల్ ఎప్పుడు వేశారు?, కొత్త మోటారే కదా? ఎందుకు రిపేరు వచ్చింది?' అని ప్రశ్నించారు. '18న ఉదయం ఎన్ని గంటలకు గేట్లు ఎత్తారు?' అని తుమ్మల ప్రశ్నించగా.. '10:30కు మొదటి గేటు, తరువాత రెండో గేటు ఎత్తాం' అని సమాధానమిచ్చారు. 12:30 తరువాత ప్రయత్నిస్తే 3వ గేటు తెరుచుకోలేదని, వర్షాలకు తడవడం వల్ల అప్పటికే మోటారు కాలిపోయిందని తెలిపారు. 'ఐబీ ఎస్ఈకి ఎప్పుడు సమాచారం ఇచ్చారు? కలెక్టర్, ఎస్పీలకు సమాచారం ఇచ్చారా? లేదా?' అని మంత్రి ప్రశ్నించారు. ఇందుకు ఐబీ ఈఈ స్పందిస్తూ.. 'సాయంత్రం 5 గంటలకు ఐబీ ఎస్ఈకి మేసేజ్ పెట్టాను' అని సమాధానమిచ్చారు. 'మెసేజ్ ఎంటి? ఫోన్ చేసి చెప్పాలి కాదా?' అంటూ మంత్రి మందలించారు. అనంతరం మంత్రి మాటాడుతూ.. ఎగువ నుంచి వచ్చే నీటి గురించి ఆంధ్రా అధికారులతో తెలుసుకుని 17వ తేదీనే ప్రాజెక్టు గేట్లు తెరిగి ఉంటే ఈ ప్రమాదం జరిగేదికాదని అన్నారు. అధికారుల సమన్వయలోపం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్పష్టం చేశారు. 1987లో కూడా ఇదే ప్రదేశంలో గండి పడిందని, దానిని అధికారులు దృష్టిలో పెట్టుకోకపోవడం ఏమిటని మందలించారు. రైతులు తనకు ఫోన్ చేసి చెప్పిన వెంటనే కలెక్టర్, ఎస్పీలను తాను అప్రమత్తం చేశానని అన్నారు. ముందుగా ఎస్పీ నారాయణపురం చేరుకొని వరదలో చిక్కుకున్న వారి ప్రాణాలను కాపాడారని అన్నారు. 'లైటింగ్ తగ్గి హైలికాప్టర్లు తిరగకపోతే ఎంత ప్రాణనష్టం జరిగి ఉండేది?' అంటూ ఐబీ అధికారులను మందలించారు. 47 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయని, 19 విద్యుత్ స్తంభాలు విరిగిపోయ్యాయని అన్నారు. వెంటనే విద్యుత్ పనుల ప్రారంభించి గ్రామాలకు విద్యుత్ అందించినట్లు డీఈఈని ఆదేశించారు. నారాయణపురం, బచ్చువారిగూడెం, గుమ్మడవల్లి, కొత్తూరు గ్రామాల్లో 500 ఎకరాల పంట నష్టం జరిగిందని, 150 ఎకరాల్లో వరినార్లు కొట్టుకుపోయ్యాయని ఏడీఏ అజ్జల్‌బేగం తెలిపారు. అనంతరం తుమ్మల మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పంటచేలను పరిశీలించి నష్టపోయిన ప్రతి రైతుకూ న్యాయం చేయాలని ఆదేశించారు. గండి పడడానికి గల కారణాలపై విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని కలెక్టర్‌కు సూచించారు.

కోయ భాష అంతరించిపోకుండా కాపాడుకోవాలి

జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీవో బీ రాహుల్

భద్రాచలం, జూలై 21: కోయభాష అంతరించి పోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత గిరిజనులపై ఉందని ఐటీడీఏ పీవో బీ రాహుల్ అన్నారు. ఆదివారం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన భవన్‌లో నిర్వహించిన కోయ భాషా దినోత్సవ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లిపిలేని కోయ భాషకు వివిధ రాష్ట్రాల అధికార భాషలను కలిపి నిఘంటువు తయారు చేసే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. త్వరలో అన్ని పాఠశాలల్లో కోయ భాషలో విద్యను బోధించేలా ప్రయత్నాలు ప్రారంభిస్తామన్నారు.

పినపాక: గల్లంతయిన వ్యక్తి కోసం వెతుకుతున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందం

వరద గోదారి

- **భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ**
- **రాత్రి 9 గంటలకు 44 అడుగులు దాటి ప్రవాహం**
- **నాలుగో రోజూ ఉమ్మడి జిల్లాలో కొనసాగిన వర్షం**
- **చేపల వేటకు వెళ్లి పినపాక చెరువులో వ్యక్తి గల్లంతు**
- **కిన్నెరసాని ఆరు, తాలిపేరు 25 గేట్లు ఎత్తి నీటి విడుదల**
- **చర్ల మండలంలో మూడు గ్రామాలకు నిలిచిన రాకపోకలు**
- **జలదిగ్బంధంలో సున్నంబట్టి, కాశీనగరం గ్రామాలు**

భద్రాచలం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ ఖమ్మం వ్యవసాయం, జూలై 21: భద్రాచలం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆదివారం రాత్రి 9 గంటలకు 44 అడుగలకు నీటిమట్టం చేరింది. దీంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఎగువన ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల వల్ల గోదావరికి వరద అంతకంతకూ పెరుగుతోంది. ఇక ఉమ్మడి ఖమ్మం జిల్లాను నాలుగో రోజూ వాన ముసురు వదలలేదు. రోజంతా వర్షం కురిసింది. పలు మండలాల్లో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. మరోవైపు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, చెరువుల్లోకి వరద భారీగా చేరుకుంటోంది. కొన్ని చోట్ల లోతట్టు ప్రాంతాల్లో వరద చేరుకుంటోంది. ఇంకొన్ని చోట్ల పంట పొలాలు నీటిమునుగుతున్నాయి. కిన్నెరసానిలో ఆరు, తాలిపేరులో 25 గేట్లను అధికారులు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పినపాక మండలంలో చేపల వేటకు వెళ్లి చెరువులో మునిగి ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. చర్ల మండలంలో మూడు గ్రామాలకు నిలిచిన రాకపోకలు నిలిచిపోయాయి. దుమ్ముగూడెం హెడ్ లాక్‌ల వద్ద గోదావరి నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి 20.2 అడుగులకు చేరుకుంది.

నిండుతున్న ప్రాజెక్టులు, చెరువులు

భద్రాద్రి జిల్లాలో ఉన్న రెండు ప్రాజెక్టులకు వరద నీరు చేరింది. కిన్నెరసానిలో 16 వేల క్యూసెక్కుల నీటిని బయటకు వదలిపెట్టారు. 407 అడుగుల నీటి సామర్థ్యానికి గాను ప్రస్తుతం 403.30 అడుగులు నీటిమట్టం ఉంది. సాయంత్రానికి ఆరు గేట్లు ఎత్తివేశారు. చర్ల మండలం తాలిపేరు ప్రాజెక్టులో మొత్తం 25 గేట్లను ఎత్తి 92,121 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. గోదావరి వరద ప్రభావం వల్ల అక్కడ ఈతవాగు పొంగడంతో గుంపల్లి చర్ల గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం కలిగింది. పర్ణశాలలో సీతవాగు పొంగి ప్రవహిస్తోంది. దుమ్ముగూడెం మండలంలో గుబ్బలమంగి ప్రాజెక్టులో భారీగా వరదనీరు చేరడంతో సున్నంబట్టి, కాశీనగరం గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. దీంతో అధికారులు అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.

భద్రాద్రి జిల్లాలో 726 మి.మీ. వర్షపాతం..

భద్రాద్రి జిల్లాలో నాలుగో రోజు ఆదివారం కూడా వర్షం కురుస్తూనే ఉంది. అత్యధికంగా అశ్వాపురంలో 83 మిల్లీమీటర్లు, మణుగూరులో 74, చర్లలో 68, దుమ్ముగూడెంలో 64, పినపాకలో 54, ఆళ్లపల్లిలో 49, గుండాలలో 33 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 726 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు

పినపాక మండలం పోట్లపల్లి గ్రామానికి చెందిన పాయం నాగేశ్ తన మిత్రుడితో కలిసి గ్రామ సమీపంలోని పెదవాగు చెక్‌డ్యాం వద్దకు చేపలవేటకు వెళ్లాడు. వాగులో దిగి చేపలు పడుతున్న క్రమంలో ఒక్కసారిగా వరద పెరగడంతో ఇద్దరు వాగులో గల్లంతయ్యారు. ఒకరు ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకుని ప్రాణాలు దక్కించుకోగా పాయం నాగేశ్ మాత్రం వరద ఉధృతికి గల్లంతయ్యాడు. ఆర్డీవో దామోదర్‌రావు, ఈ బయ్యారం ఎస్సై రాజ్‌కుమార్, ఎంపీడీవో రామకృష్ణలు ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.

ఖమ్మం జిల్లాలో 14.4 మిల్లీమీటర్ల వర్షపాతం

ఖమ్మం జిల్లాలోనూ వాన ముసురు ఆగలేదు. గడిచిన 24గంటల్లో (శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు) జిల్లా వ్యాప్తంగా 14.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కల్లూరు మండలంలో 27.6 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదు కాగా మిగిలిన మండలాల్లో 10 నుంచి 20 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మరో రెండురోజుల పాటు కూడా జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

అవసరమైతే ఫోన్ చేయండి: ఎస్పీ

కొత్తగూడెం క్రైం, జూలై 21: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు. జిల్లాలో వర్షాలు భారీగా కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి రావొద్దని సూచించారు. అవసరమైతే 100కు డయల్ చేస్తే సహాయం అందుతుందన్నారు.

ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడం, గోదావరికి వరద పోటెత్తుతుండడం వల్ల జిల్లా అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి: భద్రాద్రి కలెక్టర్

ముంపు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించడానికి సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలు కూడా పొంగుతున్న వాగులు, వంకలను దాటే ప్రయత్నం చేయొద్దని సూచించారు. అత్యవసరమైతే కంట్రోల్ రూములకు కాల్ చేయాలని చెప్పారు.

అన్నపురెడ్డిపల్లి: మత్తడి పోస్తున్న నర్సపాలెం చెరువు

చర్ల: రోడ్డుపైనుంచి ప్రవహిస్తున్న ఈతవాగు

కరకగూడెం మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న బూడిదవాగు

బిక్కు.. బిక్కు..!

- **ఈ ఏడాది కూడా మున్నేరు వరద ముంపు తప్పదా?**
- **'కరకట్ట' పనులను ప్రారంభించని కాంగ్రెస్ ప్రభుత్వం**
- **గత కేసీఆర్ ప్రభుత్వంలోనే రూ.690.53 కోట్ల నిధులు మంజూరు**
- **టెండర్లు సైతం ఖరారు.. పనులకు అడ్డొచ్చిన 'ఎన్నికల కోడ్'**
- **ఎనిమిది నెలలైనా పట్టించుకోని జిల్లా ముగ్గురు మంత్రులు**
- **భయంభయంగా గడుపుతున్న మున్నేరు ముంపు ప్రాంత ప్రజలు**

దశాబ్దాల తరబడి తాము పడుతున్న కష్టాలకు ఇక ఫుల్‌స్టాప్ పడినట్లేనని వారంతా సంబురపడ్డారు. ఈ ఏడాది మున్నేరు వరద నుంచి విముక్తి లభిస్తుందని ఆశపడ్డారు. కానీ కాంగ్రెస్ సర్కార్ వచ్చి ఖమ్మం మున్నేరు ముంపు బాధితుల ఆశలను ఆవిరిచేసింది. ఖమ్మం నగరానికి ఆనుకొని ఉన్న మున్నేరు వరద బాధితుల కష్టాలను కండ్లారా చూసిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ గత ఏడాది రూ.690.53 కోట్లను మంజూరు చేశారు. ఈ నిధులతో మున్నేరు నదికి రెండువైపులా 8.5 కిలోమీటర్ల పొడవు చొప్పున మొత్తం 17 కిలోమీటర్లు 33 అడుగుల ఎత్తుతో ఆర్‌సీసీ వాల్ నిర్మించాల్సి ఉంది. దీనికి టెండర్లను సైతం పిలిచారు. అయితే 'ఎన్నికల కోడ్' అడ్డురావడంతో పనులు ప్రారంభంకాలేదు. కానీ అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం కరకట్ట పనులను ప్రారంభించలేదు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు నోరు మెదపడం లేదు. దీంతో ఈ ఏడాది కూడా బిక్కు.. బిక్కుమంటూ కాలం వెళ్లదీయాల్సిందేనని వరద బాధితులు భయాందోళన చెందుతున్నారు. – ఖమ్మం, జూలై 21


గత ఏడాది కాల్వొడ్డు బ్రిడ్జిని ఆనుకొని ప్రవహిస్తున్న మున్నేరు (ఫైల్)

మున్నేరు వరద వల్ల ఎన్నో ఏండ్లుగా ఖమ్మం నగరంలోని సగంమంది ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారి బాధలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని గత బీఆర్ఎస్ పాలనలో సీఎం కేసీఆర్ మున్నేరుకు రెండువైపులా కరకట్ట నిర్మించేందుకు రూ.690.53 కోట్లను మంజూరు చేశారు. ఎన్నికలకు ముందే టెండర్లు పూర్తి చేశారు. ఎన్నికల కోడ్ వల్ల అప్పట్లో పనులు ప్రారంభంకాలేదు. ఎన్నికలు పూర్తికావడం, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం జరిగింది. గత ఏడాది ఎన్నికలకు ముందే టెండర్లు పూర్తి ఐనప్పటికీ ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం పనులను ప్రారంభించలేదు. ఖమ్మంజిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా మున్నేరు కరకట్ట నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిధులు ఇచ్చే ఆర్థికశాఖ, భూసేకరణ చేసే రెవెన్యూశాఖ జిల్లాకు చెందిన మంత్రులే ఉన్నా కూడా పనులు ఇంతవరకు ప్రారంభంకాలేదు. మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం మున్నేరు కరకట్ట నిర్మాణం గురించి పట్టించుకోవడం లేదు. దీంతో ఈ ఏడాది కూడా మున్నేరు ముంపు ప్రజల కష్టాలకు శుభంకార్డు పడేటట్లు కనిపించడం లేదు.

ముంపు ప్రజల బాధలు వర్ణనాతీతం..

మున్నేరు ముంపు ప్రాంత ప్రజల బాధలు వర్ణనాతీతం. ప్రతి ఏడాది వర్షాకాలంలో మున్నేరుకు వరద పెరుగుతుందంటే బొక్కలగడ్డ, మోతీనగర్, వెంకటేశ్వరనగర్, కాల్వొడ్డు, పద్మావతినగర్, సారధినగర్‌లో కొంతభాగం, రామన్నపేటకాలనీ, రంగనాయకులగుట్ట, ధ్వంసలాపురం, దానవాయిగూడెం, జలగంనగర్, సాయిప్రభాత్‌నగర్ తదితర ప్రాంతాల్లో నివసించే ప్రజలు భయంతో వణికిపోతుంటారు. రాత్రులు నిద్రలేకుండా గడుపుతారు. ఏ అర్ధరాత్రో వరద వచ్చి తమ బతుకులు నీళ్లలో కలుస్తాయోనని ఆందోళనతో సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తుంటారు. అధికారులు వీరి కోసం పలు ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తారు. వరద తగ్గే వరకు వాటిల్లో ఉండి వెళ్లడం సర్వసాధారణం. గత ఏడాది కూడా మున్నేరుకు 37 అడుగులపైన వరద వచ్చి ప్రజలు ఇబ్బందులు పడడంతో అప్పుడు ఖమ్మం మంత్రిగా ఉన్న పువ్వాడ అజయ్‌కుమార్ అప్పటి సీఎం కేసీఆర్‌కు విషయాన్ని చెప్పడంతో నిధులు తక్షణమే మంజూరు చేశారు.

శాశ్వత పరిష్కారం చూపిన కేసీఆర్..

75 ఏండ్ల చరిత్రలో ఖమ్మం మున్నేరు ముంపునకు శాశ్వత పరిష్కారం చూపిన వ్యక్తి కేసీఆర్. పోలేపల్లి చప్టా నుంచి ప్రకాశ్‌నగర్ వరకు మున్నేరుకు ఇరువైపులా 8 కిలోమీటర్ల దూరంలో ఆర్‌సీసీ వాల్‌ను నిర్మించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం రూ.690.53 కోట్లను మంజూరు చేసింది. భూసేకరణ అతి తక్కువగా ఉండేవిధంగా, ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా, పోలేపల్లి చప్టా నుంచి ప్రకాశ్‌నగర్ వరకు మున్నేరుకు ఇరువైపులా 33 అడుగుల ఎత్తు వరకు ఈ వాల్‌ను నిర్మించేలా డీపీఆర్‌ను సిద్ధం చేశారు. గత ఏడాది మున్నేరుకు 37.5 అడుగుల వరకు వరద వచ్చింది. ఇది రికార్డు వరద. ఈ వరదలను దృష్టిలో ఉంచుకుని అధికారులు 33 అడుగుల ఎత్తు వరకు వాల్ నిర్మించాలని నిర్ణయించారు. గోళ్లపాడు యాక్విడెంట్ నుంచి ప్రకాశ్‌నగర్ చప్టా వరకు మున్నేరుకు ఇరువైపులా సుమారు 8.5 కిలోమీటర్లు పొడవున చొప్పున మొత్తం 17 కిలోమీటర్లు పొడవున కరకట్ట నిర్మించనున్నారు. కరకట్ట నిర్మాణానికి సంబంధించి కిందభాగంలో 15మీటర్లు వెడల్పులో పైభాగం వచ్చే వరకు 9 నుంచి 12 మీటర్లు వెడల్పు ఉండేలా కరకట్టను నిర్మించనున్నారు. అదేవిధంగా ఖమ్మం నగరం నుంచి వచ్చే మురుగునీరును ఈ వాల్‌పక్కనే మరో డ్రైనేజి పైప్‌లైన్‌లను ఏర్పాటు చేసి వాటిని ధ్వంసలాపురం ఎస్‌టీపీ వద్ద మున్నేరులోకి వదిలేలా ప్లాన్‌చేశారు. అదేవిధంగా మున్నేరుపై మూడుచోట్ల చెక్‌డ్యామ్‌లను నిర్మించడానికి ప్రభుత్వం రూ.30 కోట్లను గత ప్రభుత్వమే మంజూరు చేసింది. పద్మావతినగర్, రంగనాయకులగుట్ట, పోలేపల్లి చప్టా వద్ద వీటిని నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయి. వీటిద్వారా ప్రకాశ్‌నగర్ నుంచి పోలేపల్లి చప్టా వరకు ఏడాది మొత్తం సుమారు 1.5 టీఎంసీల నీరు నిల్వ ఉంటుంది. తద్వారా మున్నేరుకు ఇరుప్రాంతాల్లో భూగర్భజలాలు సైతం పెరుగుతాయి. అంతేకాకుండా 8 కిలోమీటర్లు పొడవున నిర్మించే ఆర్‌సీసీ వాల్ వరకు పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేలా మెట్లు పెట్టి పైకి ఎక్కడానికి ఏర్పాటు, వృద్ధులు ఎక్కడానికి లిఫ్ట్‌లు ఏర్పాటు, లోపలికి మెట్ల ద్వారా దిగి బోటింగ్ చేసేలా ప్లాన్ రూపొందించారు. వీటితోపాటు అంతకు ముందే మున్నేరుపై తీగల వంతెనను నిర్మాణం చేసేందుకు సీఎం కేసీఆర్ ఆర్‌అండ్‌బీశాఖ ద్వారా రూ.180 కోట్లను మంజూరు చేశారు. వాల్‌కు రూ.690.53 కోట్లు, 3 చెక్‌డ్యామ్‌లకు రూ.30 కోట్లు, తీగల వంతెనకు రూ.180 కోట్లు మొత్తం రూ.900 కోట్లను మంజూరు చేశారు గత సీఎం కేసీఆర్. ప్రభుత్వం మారి 8 నెలలు అవుతున్నా ఇంతవరకు పనులు ప్రారంభంకాలేదని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు.

మున్నేరు కరకట్ట పనులు కొనసాగుతున్నవి

మున్నేరు కరకట్టకు సంబంధించి నిర్మాణ పనులు కొనసాగుతున్నవి. ప్రస్తుతం ప్రైవేటు వ్యక్తుల నుంచి భూ సేకరణ పూర్తికాలేదు. ప్రభుత్వ భూముల్లో పనులు ప్రారంభమయ్యాయి. వర్షాలు కురుస్తున్నందున పనులు నిలిచిపోయాయి. పనులకు ఎక్కడా ఆటంకం లేదు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోగా పనులు పూర్తిచేస్తాం.
– విద్యాసాగర్, సీఈ, ఖమ్మం నీటిపారుదలశాఖ

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

- **నలుగురికి తీవ్రగాయాలు**
- **మృతులు కృష్ణా, సూర్యాపేట జిల్లావాసులు**
- **ఖమ్మంజిల్లాలో ఘటన**

ఘటనాస్థలంలో చెల్లాచెదురుగా పడి ఉన్న క్షతగాత్రులు

క్షతగాత్రులను 108 వాహనంలో ఎక్కిస్తున్న ఎస్సై నాగుల్‌మీరా

చింతకాని, జూలై 21 : ఖమ్మంజిల్లా చింతకాని మండలం జగన్నాథపురం గ్రామ సమీపంలోని మూలమలుపు వద్ద ఆదివారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. చింతకాని పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణాజిల్లా వత్సవాయి మండలం కన్నెవీడుకు చెందిన కరిసే సుజాత– వెంకటరత్నం దంపతులు. సుజాతకు ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఇటీవల శస్త్రచికిత్స జరిగింది. ఆదివారం ఆసుప్రతి నుంచి డిస్‌చార్జి అయ్యారు. వీరితోపాటు సుజాతను చూడటానికి వచ్చిన ఆమె సమీప బంధువులు చెరుకుపల్లి హైమావతి– రాంబాబు దంపతులు, చావల శాంతమ్మతో కలిసి ఖమ్మానికి చెందిన ఓ ఆటోలో కన్నెవీడుకు బయలుదేరారు. జగన్నాథపురం గ్రామం దాటిన తర్వాత మూలమలుపు వద్ద బోనకల్ నుంచి ఖమ్మంవైపు వస్తున్న కారు వీరి ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కరిసే వెంకటరత్నం(50), సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కాపుగల్లు గ్రామానికి చెందిన చెరుకుపల్లి హైమావతి(45) మృతిచెందారు. సుజాత, రాంబాబు, శాంతమ్మ, ఆటోడ్రైవర్ ఎండీ సిరాజ్ తీవ్రంగా గాయపడ్డారు. అటుగా వెళ్తున్న వాహనదారులు, స్థానికులు వెంటనే చింతకాని పోలీసులు, 108కు సమాచార మిచ్చారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై షేక్ నాగుల్‌మీరా రక్తమోడుతున్న క్షతగాత్రులను ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని వైరా సీఐ నునావత్ సాగర్ సైతం పరిశీలించారు. కారును అక్కడే వదిలి డ్రైవర్ పరారయ్యాడు. ఎస్సై నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో 'గురుపౌర్ణమి'

- **జిల్లాలో భక్తులతో కిక్కిరిసిన సాయినాథుడి మందిరాలు**

'ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి..' అనే సంకీర్తనలతో ఉమ్మడి జిల్లాలోని సాయి మందిరాలు మార్మోగాయి. గురుపౌర్ణమి సందర్భంగా బాబా మందిరాలన్నీ ఆదివారం భక్తులతో కిక్కిరిశాయి. ఆయా ఆలయాల వద్ద సాయినాథుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పలు మందిరాల్లో ఆలయాల్లో బాబా ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రముఖ ఆలయాల్లో సాయిబాబాకు పంచామృతాలతో అభిషేకం చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొలువుదీరిన సాయి మందిరాల్లో జరిగిన ప్రత్యేక పూజల్లో సాయి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీలు భక్తులకు అన్నదానం చేశారు.

–నమస్తే తెలంగాణ నెట్‌వర్క్

పాల్వంచలో..

భద్రాచలంలో..